'డబుల్' ఇళ్లు కేటాయించాలని మంత్రికి వినతి



మంత్రి పొన్నంను వినతి పత్రం అందజేస్తున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: ఇళ్లు రాని వారికి కమలానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్లను త్వరగా కేటాయించాలని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. తాను చేసిన విజ్ఞప్తిపై మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించినట్లు సీఎన్ రెడ్డి స్పష్టం చేశారు.

'నవరాత్రి ఉత్సవాలకు హాజరుకండి'



కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌ను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

ఫిలింనగర్: ఫిలింనగర్ దుర్గాభవానీనగర్, గౌతమ్‌నగర్‌లకు చెందిన శక్తిభవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలంటూ జూబ్లీహిల్స్ డివిజన్ వెల్దండ వెంకటేష్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఈ సందర్భంగా వారికి ఆయన సూచించారు.



సరస్వతీదేవిగా శ్రీనగర్ కాలనీ భ్రమరాంబికాదేవి అమ్మవారు



సరస్వతీదేవిగా దైవసన్నిధానం రాజరాజేశ్వరి దేవి



సరస్వతీదేవిగా మాగంటి కాలనీ విజయ కనకదుర్గ



సరస్వతీదేవిగా బంజారాహిల్స్‌లోని కనకదుర్గాదేవి

సరస్వతీ నమస్తుభ్యం

వాడవాడలా అమ్మవారికి ఘనంగా పూజలు
చిన్నారులకు సందడిగా అక్షరాభ్యాసం



మాగంటి కాలనీ విజయ కనకదుర్గాదేవి ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి

బంజారాహిల్స్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాలతో పాటు వాడవాడలా ఏర్పాటు చేసిన ప్రతిమల వద్ద భక్తులు ఘనమైన బుధవారం ఘనమైన పూజలు నిర్వహించారు. పంజగుట్ట అమ్మవారి ఆలయంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివమాదిగ, రాధిక శ్రీనివాస్, రామకృష్ణ, యాకరి గణేష్ తదితరులు పాల్గొన్నారు. పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో ఫిలింనగర్ దైవసన్నిధానంలో అక్షరాభ్యాస వేడుకల్లో చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారామస్వామి ఆలయంలో

జూబ్లీహిల్స్ శ్రీ సీతారామస్వామి దేవాలయంలో కొలువుదీరిన పర్వతవర్ధినిదేవి బుధవారం సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సరస్వతీ పూజ నిర్వహించి విద్యార్థులకు ఆశీర్వచనాలు అందించారు.



సీతారామస్వామి ఆలయంలో...



పంజగుట్ట అమ్మవారి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం



నందినగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో కార్పొరేటర్ మన్నె కవితా గోవర్ధన్‌రెడ్డి



ఫిలింనగర్ దైవసన్నిధానంలో అక్షరాభ్యాస వేడుకలు

వేడుకగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామివారి తిరుకల్యాణ మహోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ కల్యాణ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహన సేవలో ఊరేగించారు. శ్రీవారికి ఎంతో ప్రీతిపాత్రమైన గరుడ వాహన సేవలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి విచ్చేశారు.

మగువల మదిదోచే చేనేత ప్రదర్శన



వస్త్రాలను తిలకిస్తున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: దసరా, దీపావళి పండగల నేపథ్యంలో అమీర్‌పేట కమ్మ సంఘంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన మహిళలను అమితంగా ఆకట్టుకుంటుంది. ప్రదర్శనలోని రంగురంగుల చీరలు మగువల మనసు దోచుకుంటున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన నిష్ణాతులైన చేనేతకారుల సిల్క్, కాటన్ వస్త్రాలు ఎక్స్‌పోలో ఉన్నాయని, ఈ నెల 15వ తేదీ వరకు ఈ చేనేత ప్రదర్శన వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ ఆఫ్ ఆఫీస్ డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు.

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి



అన్నదాన కార్యక్రమంలో బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్(బోరబండ): అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అకాంక్షించారు. బోరబండ బస్ స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దసరా ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని గుర్తు చేశారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్, అసోసియేషన్, కాలనీ మహిళలు

వెంగళరావునగర్: మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలు కాలనీవాసులను ఆకట్టుకున్నాయి. అట్టహాసంగా జరిగిన ఈ బతుకమ్మ వేడుకలకు కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రంగురంగుల పూలతో అందంగా తయారు చేసిన బతుకమ్మలను కాలనీ మహిళలు తయారు చేసిన కాలనీ ప్రధాన వీధిలో ఏర్పాటు చేసిన స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందడోలికల్లో మునిగిపోయారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ దేదీప్య విజయ్ మహిళతో కలిసి బతుకమ్మ ఆటలాడారు. కాలనీ అసోసియేషన్ మహిళా విభాగం కన్వీనర్ పద్మ, కో కన్వీనర్ హరిత, కాలనీ ఇన్‌చార్జి అధ్యక్షుడు మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, సహాయ కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి సుగుణ తదితరులు పర్యవేక్షించగారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, వెంగళరావునగర్ అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన మహిళలు అంబిక సంతోషి, బ్రహ్మకుమారీ సమాజ్, రమ్యలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు.

ఎస్పీఆర్‌హిల్స్‌లో మంత్రి కొండా సురేఖ పూజలు



రహమత్‌నగర్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా రహమత్‌నగర్ డివిజన్ పతిభానగర్ సనాతన్ ధరమ్ గోశాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం రాత్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు అందజేశారు. అనంతరం స్థానికంగా ఉన్న గోశాలలోని గోమాతలకు పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, బోరబండ డివిజన్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, రహమత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్‌కు పరామర్శ

లిబర్టీ: కూతురు మృతితో దుఃఖసాగరంలో ఉన్న ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌ను బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు, బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి పరామర్శించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ కూతురు చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు.



నివాళులర్పిస్తున్న కుమారస్వామి, కృష్ణమోహన్‌రావు

ఆధ్యాత్మిక ప్రసంగాలపై కవి సమ్మేళనం

చిక్కడపల్లి: గీతా ఫౌండేషన్ కుసుమ ధర్మన్న కళాపీఠం, నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషనల్, స్పోర్ట్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఐఏఎంఎస్, నీట్ అకాడమీ సౌజన్యంతో ఆధ్యాత్మిక ప్రసంగాలపై కవి సమ్మేళనం జరిగింది. కవులు, కవయిత్రులు పాల్గొని స్వీయ కవితలను చదివారు. విశ్వసాహితీ సంస్థ అధ్యక్షుడు బి.జయరాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం కవులు, కవయిత్రులకు ప్రశంస పత్రాలను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రామకృష్ణచంద్రమౌళి, నరేందర్‌రెడ్డి, యోగేష్ ప్రభు, శ్రీనివాస్‌యాదవ్, మనోహర్‌రెడ్డి, సత్యనారాయణస్వామి, దామోదర్‌రావు, అంజనీకుమారి, కనకయ్య, రాధా కుసుమ, బడే సాబ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీణవాద్య కచేరి

నల్లకుంట: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీసరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం న్యూ నల్లకుంటలోని న్యూ రామాలయంలో భక్తి సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వీణా విద్వాంసుడు, పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ ప్రదర్శించిన వీణవాద్య కచేరి ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే శ్రీసరస్వతి సంగీత విద్యాలయం ఉపాధ్యాయురాలు యశస్విని ఆధ్వర్యంలో రాగిణి, శ్రావణి, శ్రీవిద్య, చేతన్ శర్మ, దీపీష బృందంచే నిర్వహించిన భక్తి సంగీత కచేరి విశేషంగా అలరించింది. దీనికి మృదంగంపై రవికుమార్ వాద్య సహకారమందించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు, కమిటీ సభ్యులు శ్రీనివాస శర్మ, యశస్విని బృందాన్ని శాలువాతో సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

గురుకులాల పెండింగ్ బిల్లుల విడుదల భేష్

పంజగుట్ట: గురుకుల పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఒకేసారి విడుదల చెయ్యడం రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి అని దీంతో గురుకుల కాంట్రాక్టర్ల ఇళ్లల్లో ముందుగానే పండగ తీసుకువచ్చారని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లెపల్లి నర్సింగరావు అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు వారు కృతజ్ఞతాభివందనాల సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు నల్ల శ్రీనివాస్, ఎనికెపల్లి ఆనంద్‌లతో కలిసి మాట్లాడుతూ... 10 నెలలుగా బకాయిలుగా ఉన్న రూ. 1100 కోట్లను ఒకేసారి విడుదల చెయ్యడం ఎంతో సంతోషకరమన్నారు.

అమ్మవారి ప్రత్యేక పూజలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్ల పరిధిలో ప్రత్యేక ఏర్పాటుచేసిన మండపాల్లో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని ఖైరతాబాద్ ఎన్ఎస్‌యూఐ నేత జీవన్‌రాజ్ రాథోడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వమించారు.

కూతురు వరసైన బాలికపై లైంగిక వేధింపులు

వెంగళరావునగర్: కూతురు వరసైన మైనర్ బాలికను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌కు చెందిన మహిళకు కొన్నేళ్ల కిందట ఖదీర్ అనే వ్యక్తితో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత భర్తతో మనస్పర్థలు రావడంతో విడిపోయారు. భర్త నుంచి దూరమైన ఆమె తన పిల్లలను అన్న వద్ద ఉంచి ప్రైవేట్ జాబ్ చేసుకుంటుంది. దాదాపు రెండేళ్ల కిందట మహేందర్ అనే వ్యక్తితో పరిచయమై వివాహం చేసుకుంది. వారికి ఒక బాబు పుట్టాడు. మహేందర్ ఒత్తిడితో తన అన్న వద్ద ఉంటున్న పిల్లలను ఇంటికి తెచ్చుకున్నారు. ఆమె ఉద్యోగరీత్యా బయటకు వెళ్లనపుడు ఆమె కుమార్తెను మహేందర్ లైంగికంగా వేధించసాగాడు. తన తల్లితో చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ క్రమంలో భర్త వ్యవహారాన్ని గమనించిన మహిళ తన కుమార్తెను అడిగింది. ఆ మైనర్ బాలిక మహేందర్ చేస్తున్న వేధింపులను తల్లికి చెప్పింది. ఆమె కుమార్తెను హాస్టల్‌లో ఉంచింది. దీనికి ఆగ్రహించిన మహేందర్ ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను తీసుకుని వెళ్లిపోయాడు. బాధితురాలు బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమాజ పురోగతికి సోషలిజమే మార్గం

కాచిగూడ: సామాజిక పురోగతికి సోషలిజమే మార్గమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు. గెరిల్లా పోరాట యోధుడు ఎర్నెస్టో చేగువేరా 57వ వర్ధంతి సందర్భంగా బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాకుండా అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు శ్రీకాంత్, శ్రీమాన్, రాజమౌళి, కళ్యాణ్, అనిల్ కుమార్, జగన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘనంగా నివాళి



కాన్షీరాంకు నివాళులర్పిస్తున్న దృశ్యం

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ రోడ్డునెంబర్ 3/5లో లేబర్ అడ్డా వద్ద బుధవారం మన్యవర్ కాన్షీరాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి దోరపల్లి రమేష్ హాజరై కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓట్ హమారా రాజ్య తుమారా నహీ చెలేగా నహీ చెలేగా అంటూ మొట్టమొదటిసారిగా ఉత్తరప్రదేశ్‌లో బహుజన్ సమాజ్ పార్టీని స్థాపించారన్నారు. నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మనోజ్‌కుమార్, శంకర్ మస్తాన్, వెంకటమ్మ, అభిలాష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

9 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాచిగూడ: అక్రమంగా తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక డివిజన్ ఖజాగరీబ్ నగర్ ప్రాంతానికి చెందిన మోహినోద్దీన్ కుమారుడు ఎండీ ఆసిఫ్ (33) రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మానేపల్లి'లో సరికొత్త కలెక్షన్స్



ఆభరణాలను ప్రదర్శిస్తున్న మోడల్స్

పంజగుట్ట: దసరా, దీపావళి పండగ సీజన్, వార్షికోత్సవం పురస్కరించుకుని పంజగుట్టలోని మానేపల్లి జ్యువెలరీలో సువర్ణపుర బ్రైడల్ జ్యువెలరీ కలెక్షన్స్, స్ప్లెండిడ్ స్పార్కిల్ డైమండ్ జ్యుయలరీ కలెక్షన్స్‌ను ప్రారంభించింది. నటి నిషాత్, మోడల్ మౌనిక, అమూల్యలతో పాటు ఆభరణ ప్రియులు ఈ సరికొత్త కలెక్షన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆభరణాలు ప్రదర్శిస్తూ ర్యాంప్ వాక్ చేశారు. సంస్థ డైరెక్టర్లు మురళీకృష్ణ, గోపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై మాజీ విలేకరి ఆత్మహత్య

వెంగళరావునగర్: మద్యానికి బానిసైన ఓ మాజీ విలేకరి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... యాదగిరినగర్‌లో నివసించే ఎం.వీరబాబు గతంలో ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేశాడు. అదే సమయంలో ప్రేమ వివాహం కూడా చేసుకుని కొంతకాలం తర్వాత భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి ఇంటిలోని హాల్‌లో పడుకున్నాడు. అతని అక్క, అన్న వేరే గదుల్లో నిద్రపోయారు. బుధవారం ఉదయం సోదరుడు శ్రీనివాసరావు, అక్క మంగాదేవి నిద్ర లేచేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడు. హుటాహుటిన శ్రీనివాసరావు సోదరుని మృతదేహాన్ని కిందకు దింపి పోలీసులకు సమాచారం అందించారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సందడిగా మాతా జాగరణ్



మాతా జాగరణ్‌లో పాల్గొన్న విజయారెడ్డి తదితరులు

ఖైరతాబాద్: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో మాతా జాగరణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖైరతాబాద్ జై గణేష్ ఉత్సవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాతా జాగరణ్ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొని మహిళలతో బతుకమ్మ ఆడారు. దాండియా, ఆటపాటలతో ఉత్సాహంగా సాగిన మాతా జాగరణ్ కార్యక్రమంలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజుల బకాయిలు మొత్తం రూ.4500 కోట్లలో కేవలం రూ.1500 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. మిగతా రూ.3వేల కోట్ల ఫీజు బకాయిలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులు ఇబ్బందులు పడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, నేతలు నీల వెంకటేష్, నంద గోపాల్, కీర్తిలతగౌడ్, అంజి, ప్రణీత, జనార్దన్, మల్లేష్, రిషి, సాయికిరణ్, ప్రభాకర్, హరితిలక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.